క్లుప్తంగా

ఉచితంగా నిత్యావసర సరుకులు అందించాలి

నారాయణపేట టౌన్ : పేద ప్రజలకు 12 రకాల నిత్యావసర సరుకులు ఉచితంగా అందించాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.కాశీనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేద ప్రజలకు ఒక్కొక్కరికీ కేంద్రం 5 కేజీలు, రాష్ట్రం 5 కేజీలు సన్న బియ్యం పంపిణీ చేయాలన్నారు. రేషన్ దుకాణాల ద్వారా మంచి నూనె, కందిపప్పు, చింతపండు, చక్కెర, టీ పొడి, ఉప్పు, కారం, పసుపు, గోధుమలు, పల్లీలు ఉచితంగా అందించాలన్నారు. అదేవిధంగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమం చేపడతామని అన్నారు.

28న ఆత్మీయ సమ్మేళనం

నర్వ: రాయికోడ్‌లోని పల్లె దవాఖాన ప్రారంభోత్సవం, అదేవిధంగా బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని వివరించారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ ఉంటుందన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అమరచింత: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహిస్తున్న మండల స్థాయి ఆత్మీయ సమ్మేళనానికి కార్యకర్తలు తరలిరావాలంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ ,పట్టణ అధ్యక్షుడు నరసింహులుగౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని నరేష్‌రెడ్డి ఫాంహౌస్‌లో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రోడ్డుపై పారుతున్న మురుగు

మాగనూర్: మండల పరిధిలోని కొత్తపల్లిలో ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రహదారి వెంటే మురుగు పారుతోంది. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

వృథాగా భగీరథ నీరు



నారాయణపేట టౌన్ : పట్టణంలోని పళ్ల వీధిలో మిషన్ భగీరథ నీరు వృథాగా రోడ్డుపై పారుతోంది. భగీరథ పథకంలో భాగంగా వీధిలో ఇంటింటికి నల్లా కనెక్షన్లు అందించారు. కొందరి కనెక్షన్లు లీకేజీ అయ్యాయి. నీరు రోడ్డుపై పారుతుండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా లీకేజీ వల్ల నీరు కలుషితమవుతోందని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

జగ్జీవన్‌రాం ఆశయాలను కొనసాగిద్దాం

అమరచింత: జగ్జీవన్‌రాం ఆశయాలను కొనసాగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి అన్నారు. ఆత్మకూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న ఖాళీస్థలంలో ఆదివారం జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు. త్వరలో విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆనాడు దేశ సౌభాగ్యం కోసం ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను అర్పించారన్నారు. ఎంపీపీ శ్రీనివాసులు, పీఏసీఎస్ అధ్యక్షుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మత్స్యకార్మిక సంఘం ఎన్నిక

చిన్నచింతకుంట: మండలంలోని బండ్రపల్లిలో మత్స్యకార్మిక సంఘం గ్రామ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయిలు, ఉపాధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా శేఖర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచు సతీష్ తదితరులు ఉన్నారు.

శ్రీరామకొండపై ప్రత్యేక పూజలు

కోయిల్‌కొండ: మండలంలోని ప్రసిద్ధ శ్రీరామకొండ క్షేత్రం అంకిళ్లకు చెందిన కమిటీ సభ్యులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకిళ్లలో ఏర్పాటు చేసిన శ్రీరామ ఆలయం సంప్రోక్షణ కోసం శ్రీరామకొండపై ఉన్న మహిమాన్వితమైన కోనేరులో నీటిని తీసుకెళ్లారు. ఇప్పటికే భద్రాచల గోదావరి, కృష్ణానదుల నీటిని తీసుకొచ్చినట్లు తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనం

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని మణికొండ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. అనంతరం గురువులు బాలప్ప, నారాయణ, లక్ష్మీనారాయణలను సన్మానించారు.

తప్పని ఎదురుచూపులు

- వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్న మల్టీపర్పస్ వర్కర్లు
- పట్టించుకోని అధికారులు



మాగనూర్‌లో మొక్కలకు నీళ్లు పోస్తున్న కార్మికులు(ఫైల్)



పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

మాగనూర్: జిల్లాలోని ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులు వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. ఆరు నెలలుగా అవస్థలు పడుతున్నారు. అసలే వేతనాలు అరకొరగా ఉండగా ఇవ్వడంలోనూ జాప్యం జరుగుతుండడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితులలో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఇలా..

మండలంలో 16 గ్రామ పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు, వాటర్‌మెన్, ఎలక్ట్రీషియన్, ట్రాక్టర్ డ్రైవర్, కారోబార్లతో కలిసి మొత్తం 53 మంది మల్టీపర్పస్ సిబ్బంది పనిచేస్తున్నారు. నెలకు రూ. 8500 చొప్పున వీరికి వేతనాలు చెల్లిస్తున్నారు. మండలంలో ప్రతినెల రూ. 4 లక్షలకు పైగా వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. సాధారణ గ్రామ పంచాయతీలకు జనాభా ప్రతిపాదికన ప్రభుత్వాలు ఆర్థికసంఘం నిధులు విడుదల చేస్తున్నాయి. ఎస్‌ఎఫ్‌సీ నిధులు అదనంగా రావాల్సి ఉంది. వీటితో పాటు పంచాయతీల్లో ఇంటి పన్ను, రిజిస్ట్రేషన్‌లు, తదితరాల రూపంలో ఆదాయం వస్తుంది. కానీ ప్రస్తుతం నిధులు రాకపోవడంతో సిబ్బందికి వేతనాలు ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉంటే ఇచ్చే వేతనాలు సైతం అరకొరగానే ఉండడంతో ఇప్పటికే అనేకసార్లు గ్రామ పంచాయతీ సిబ్బంది ఆందోళనలు చేపట్టారు. కుటుంబ పోషణ భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం వేతనాలు అందించడంలో ఆలస్యం లేకుండా సమయానికి ఇచ్చేలా చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ శ్రమను గుర్తించాలని, వేతనాలు పెంచడంతో పాటు సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇల్లు గడవడం కష్టంగా ఉంది



ఆరునెలలుగా వేతనాలు రావడం లేదు. దీంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. వచ్చేదే అరకొరగా ఉందంటే అది ఇవ్వడంలోనూ జాప్యం చేస్తున్నారు. ఇల్లు గడవడం కష్టంగా ఉంది. అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోంది.

– అంజప్ప, కార్మికుడు, ఓబ్లాపూర్

సమస్య పరిష్కరించాలి



ప్రస్తుతం వస్తున్న వేతనాలు అరకొరగా ఉండడంతో ఇల్లు గడవడం సమస్యగా మారింది. అవి కూడా సమాయానికి ఇవ్వడంలేదు. ఒక వైపు రోజు రోజు నిత్యావసర సరుకు ల ధరలు పెరుగుతుండడంతో సరిపోవడం లేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– మారెప్ప, కార్మికుడు, మాగనూర్

త్వరలోనే అందజేస్తాం



నిధుల కొరత వల్ల పంచాయతీ కార్మికులకు సకాలంలో వేతనాలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమే. సమస్య మా దృష్టిలోనూ ఉంది. అయితే కార్మికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే అందజేస్తాం.

– సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ, మాగనూర్

మక్తల్ వాసులకు 'నంది' పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న తిప్పయ్యస్వామి, శ్రావణ్‌కుమార్

మక్తల్: ఉగాదిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు నంది పురస్కారాలు ఆదివారం అందుకున్నారు. మక్తల్‌కు చెందిన శ్రీమల్లికార్జున స్వామి ఆలయ పూజారి తిప్పయ్యస్వామి, అదేవిధంగా మద్వార్‌కు చెందిన శ్రావణ్ కుమార్ పురస్కారాలు అందుకున్నవారిలో ఉన్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ చైర్మన్ వేణుగోపాలాచారి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పురస్కారాలు అందజేశారు. ఆధ్యాత్మిక రంగాల్లో పనిచేస్తూ గుర్తింపు పొందడంతో వీరిని పురస్కారాలు వరించాయి. ఈ సందర్భంగా పలువురు వీరిని అభినందించారు. సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ ఇందిరా, మార్కెట్ మాజీ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి, హెచ్‌ఎం నర్సిరెడ్డి , అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

గోశాల వార్షికోత్సవం



బిజ్వార్‌లో కల్యాణ మహోత్సవం



గోశాలను పరిశీలిస్తున్న వైద్యబృందం

మాగనూర్(కృష్ణ): మండల కేంద్రంలోని గోవిందా దామ గోశాల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా రాయచూర్ జిల్లా కేంద్రంలోని ఎంకే బండారి ఆస్పత్రి ఆధ్వర్యంలో దాదాపు 250 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు శీతల జైపూర్కార్, రోహిత్, అనిరుధ్ కులకర్ణి, శివకుమార్, గోశాల కమిటీ సభ్యులు నారాయణభట్, సురేష్ భట్, సచిన్ భట్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: బిజ్వార్‌లోని శ్రీశక్తి పీఠంలో ఆదివారం శ్రీశ్రీ ఆదిత్యపరాశ్రీస్వామి ఆధ్వర్యంలో గోకల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. బసవలింగ అవధూతస్వామి, శ్రీరేణుకాచార్యస్వామి, లక్ష్మారెడ్డిస్వామి తదితర భక్తులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏఎస్‌ఐ శంకరయ్య

మరికల్: ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్‌ఐ శంకరయ్య అన్నారు. మండలంలోని పల్లెగడ్డలో ఆదివారం సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం మానుకోవాలని సూచించారు. అసమానతలు పాటించడం సరికాదన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. గ్రామాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే భవిష్యత్‌లో చోరీలను పూర్తిగా అరికట్టవచ్చన్నారు. అనంతరం కళాబృందం సభ్యులు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఏఎంఓ విద్యాసాగర్

నారాయణపేట రూరల్ : జిల్లా స్థాయిలో నిర్వహించిన పూసల్‌పహాడ్ టాలెంట్ టెస్ట్ ఫలితాలను నిర్వాహకులు శేర్‌కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం డీఈఓ కార్యాలయంలో ఏఎంఓ విద్యాసాగర్ చేతులమీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా ఈ ప్రాంత విద్యార్థుల ప్రతిభ వెలికి తీసేందుకు కృషి చేస్తుండడాన్ని అభినందించారు. మొదటి మూడు స్థానాల్లోని విద్యార్థులకు నగదు బహుమతులు, టాప్ 20 విజేతలు, పాఠశాలల వారీగా టాపర్‌లకు ప్రశంసా పత్రాలు బుధవారం జిల్లాకేంద్రాలో అందజేయనున్నారు. దీంతో పాటు పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తారని వివరించారు. తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహా, కోశాధికారి కిశోర్, ఉపాధ్యాయులు సురేష్, నాగార్జున్‌రెడ్డి, బసిరెడ్డి, తిరుపతయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గుర్నాథ్‌రెడ్డి, కుర్మయ్య, శ్రీనాథ్, విశ్వేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజేతలు వీరే...

టాలెంట్ టెస్ట్‌లో 115మార్కులతో మక్తల్ పట్టణంలోని కృష్ణవేణి స్కూల్ విద్యార్థిని మంజూల ప్రథమస్థానంలో నిలిచింది. 110 మార్కులతో నారాయణపేట లిటిల్‌స్టార్స్ స్టూడెంట్ సకేనా ఫాతిమా రెండో స్థానంలో, 109 మార్కులతో రవితేజ స్కూల్ చిన్నారి అక్షయ మూడోస్థానంలో నిలిచారు.

మందులు అందుబాటులో ఉంచాలి

మరికల్: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని రైతులు హన్మంతు, రాములు, వెంకటయ్యలు అన్నారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడారు. రెండేళ్లుగా ఆస్పత్రిలో మందులు లేకపోవడంతో ప్రైవేట్ వెటర్నరీ దుకాణాలకు పంపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

31న సీతారాముల కల్యాణ మహోత్సవం

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని మూల హనుమాన్ మందిరం ఆధ్వర్యంలో ఈనెల 30న శ్రీ రామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమాన్ మందిరంలో సీతా సమేత శ్రీ రామచంద్ర స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 7 గంటలకు చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమం ఉంటుందని, పట్టణ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వీరభద్రుడికి ప్రత్యేకపూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లిలో వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి జాతర వైభవంగా కొనసాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి రుద్రాభిషేకం, డోలారోహణం నిర్వహించారు. తెల్లవారు జామున అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం భజన సంకీర్తనలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మహారథోత్సవం నిర్వహించారు. సోమవారం స్వామి వారికి రుద్రాభిషేకం, పుట్టపూజ, అఖండహారతి నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలేదీక్షలు

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని ఆదివారం 62వ రోజు రిలేదీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా మండల కన్వీనర్ రామునాయక్, కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల పాలనా సౌలభ్యం కోసం రెండో మండలంగా గార్లపహాడ్‌ను ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిలేదీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు డాక్టర్ చంద్రయ్య, రవి, బాలు, రాజు, లక్ష్మీనారాయణ, ఉపేందర్, ముస్తాక్, కృష్ణారెడ్డి, భగవంతు, రాము తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని లయోలా జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు (2008–10) ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనుగొండలోని అనాథ శరణాలయంలో విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. కార్యక్రమానికి గురువు విజేత వెంకట్‌రెడ్డిని ఆహ్వానించి సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భాను, ఆనంద్, నిఖిల్, భూపాల్, దూద్‌వలి, రాజేందర్‌రెడ్డి, రాజ్‌కుమార్, రాములు, దశరథ్, దీపక్, భరత్, శివరాం పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు



హోమంలో పాల్గొన్న గ్రామస్తులు

కోస్గి: మున్సిపల్ పరిధిలోని మల్‌రెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన శివాలయంలో కాశీ విశ్వనాథ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. రెండోరోజు ఆదివారం తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపారాధన, దేవీ హోమం, విగ్రహాలకు అభిషేకం, ధాన్యాదివాసం, మంగళ హారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వైదిక తపోనిధి రుద్రాక్షల మఠం అమరలింగ స్వామి ఆధ్వర్యంలో, వైదిక రత్న వీరేశలింగం, పరమేష్ శాస్త్రీ, మఠం శివకుమార్, మఠం వినయ్ కుమార్ సమక్షంలో శాస్త్రోక్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

జన చైతన్య యాత్రపై సమావేశం



మాట్లాడుతున్న నాయకులు

నారాయణపేట టౌన్ : సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే జన చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, నాయకులు బాల్‌రాం పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో సీపీఎం జన చైతన్య బస్సు యాత్ర కొనసాగుతోందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం నుంచి నారాయణపేట జిల్లా పరిధిలోని కోటకొండ గ్రామంలోకి సోమవారం ఉదయం 8 గంటలకు బస్సు యాత్ర ప్రవేశించనుందన్నారు. కోటకొండ నుంచి బొమ్మన్‌పాడ్, కంసాన్‌పల్లి, వత్తుగుండ్ల, క్యాతన్‌పల్లి, దామరగిద్ద మండల కేంద్రం మీదుగా మధ్యాహ్నం 12 గంటలకు నారాయణపేట జిల్లా కేంద్రానికి చేరుకుంటుందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, చుక్కరాములు, సాగర్, రాష్ట్ర నాయకులు ఎస్ రమా, ఆర్ వెంకట్రాములు, ఎంవీ రమణ హాజరై సత్యనారాయణ చౌరస్తాలో ప్రసంగిస్తారని వివరించారు. నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

'గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం'



మాట్లాడుతున్న ప్రభాకర్‌వర్ధన్

దామరగిద్ద: రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ వర్ధన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభాకర్ వర్ధన్ హాజరై మాట్లాడారు. బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ ప్రజలకు కేంద్రం అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు గోపాల్ రావ్, మండల ప్రధాన కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

మక్తల్: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. అదేవిధంగా సీఎం కేసీఆర్ సహకారంతో మక్తల్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. రూ.5 కోట్లతో పట్టణంలో చేపడుతున్న సీసీరోడ్డు పనులను ఆదివారం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కౌన్సిలర్ నర్సిములు, ఏఈ నాగశివ, రాంలింగం, శివారెడ్డి, పాల్గొన్నారు.

ఊట్కూర్: ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నిడుగుర్తి పాఠశాలలో శనివారం రాత్రి నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం శక్తివంచన లేకుండా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు చేపట్టిన నృత్యాలు, నాటికలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ యశోదమ్మ, ఎంపీటీసీ రాఘవరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరవింద్ కుమార్ ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపల్లిశివారులో కల్వర్టు, బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతర్గత రోడ్లను, డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. సీసీ రోడ్లు, కాల్వల పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలను సందర్శించారు. మండలంలో ఇప్పటికే పలు గ్రామాలకు బీటీరోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. కొత్తపల్లి నుంచి పొత్తపల్లి వరకు నిర్మించే రోడ్డుకు రూ. 72 లక్షలు, కొత్తపల్లి నుంచి గుస్‌ముకుల వరకు నిర్మించే రోడ్డుకు రూ. 50 లక్షల నిధులు మంజూరు చేశామన్నారు. సర్పంచ్ శాంతమ్మ, జెడ్పీటీసీ అశోక్ కుమార్ గౌడ్, వైస్ ఎంపీపీ ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా రోడ్డు పనులు



కంకర తేలిన రోడ్డు

మరికల్: మండల కేంద్రం నుంచి కన్మనూర్ వెళ్లే రహదారి మధ్యలో నిర్మించిన రైల్వే బ్రిడ్జిపై బీటీరోడ్డు పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. కంకర తేలడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. పదేళ్ల క్రితం బాధ్యులు నాణ్యత లేకుండా పనులు చేసి, అసంపూర్తిగా వదిలేశారని ప్రయాణికులు అంటున్నారు. రాత్రివేళ ప్రయాణించడానికి జంకుతున్నారు. విషయాన్ని పలు మార్లు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

డైరెక్టర్‌గా కొండారెడ్డి

ధన్వాడ: నారాయణపేట జాతీయ వ్యవసాయ మార్కెట్ పాలక మండలి డైరెక్టర్‌గా చీరాల కొండారెడ్డి నియమితులయ్యారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు స్వీట్లు తినిపించారు. ధన్వాడ నుంచి తనకు డైరెక్టర్‌గా అవకాశం రావడంపై ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి కొండారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు.

